www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 29 ఏప్రిల్ 2023
5
వైఎస్ఆర్



ప్రజల ప్రాణ భద్రత అందరి బాధ్యత : కలెక్టర్
ప్రజాశక్తి - కడప

ప్రజల ప్రాణ భద్రత మనందరి సామాజిక బాధ్యత అని, ఆ దిశగా జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తం, మనస్ఫూర్తిగా పని చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా రహదారుల భద్రత సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి వాహన ప్రమాదాలను అరికట్టే దిశగా భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా యువతకు వాహనాలను కొనిచ్చే తల్లిదండ్రులు కూడా పిల్లలకు బాధ్యతలను గుర్తు చేయాలని సూచించారు.

టెక్నీషియన్ పోస్టుల భర్తీలో
ఇష్టారాజ్యం

- అర్హతకు నోచని మెడికల్ ఇన్‌సర్వీస్ పీజీలు
- గైడ్‌లెన్స్‌కు అప్‌డేట్ కాని ఫలితమేనని విమర్శ
- ఆందోళనలో పీజీ డిప్లొమాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఊపందుకుంది. ఇటీవల కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో మూడు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 40 మంది టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో 13 మంది పీజీ డిప్లొమా చేసిన దరఖాస్తుదారులు ఉన్నట్లు సమాచారం. 2013 సంవత్సరంలో 108 సేవల విభాగంలో సీనియర్లు గుర్తింపు పొంది, ఎంట్రన్స్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారిని పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులకు ప్రభుత్వం తరుపున ఎంపికైన వారిని విస్మరించడం ఎంత వరకు సమంజసమనే విమర్శలు ఉన్నాయి. పీజీలను విస్మరించి బిఎస్‌సి ఇఎంటి చేసిన వారిని అర్హులుగా నిర్ణయించమేమిటనే ప్రశ్న వినిపిస్తోంది. 2022 నవంబర్‌లో విజయనగరం జిల్లాలో కొత్తగైడ్ లైన్స్ ప్రకారం పోస్టుల భర్తీ నడిచినట్లు పీజీ డిప్లొమా ఉద్యోగార్థులు వాపోతున్నారు. గైడ్‌లెన్స్ అప్‌డేట్ గాకుండా ఇష్టానుసారంగా వ్యవ హరించమేమిటనే వాదన వినిపిస్తోంది. 2022 ఆగస్టులో రాష్ట్రంలోని 10 పాత వైద్య కళాశాలలకు మూడు పోస్టుల చొప్పున 64 టెక్నీషియన్ పోస్టులను భర్తీ ప్రక్రియ నడిచింది. 61 పోస్టులను భర్తీ చేసినట్లు సమాచారం. మిగిలిన మూడు పోస్టులు ముఖ్యమంత్రి జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందినవి కావడం గమనార్హం. 2022 ఆగస్టులో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టింగులను భర్తీ చేయాల్సి ఉంది. కానీ 2023 మార్చిలో ఆగమేఘాల మీద నోటిఫికేషన్ విడుదల చేసి ఇష్టారాజ్యంగా టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టడమేమిటనే ప్రశ్న వినిపిస్తోంది. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల రిక్రూట్‌మెంట్‌లో పీజీ డిప్లొమా, బిఎస్‌సి ఇఎంటిలకు సమాన అవకాశాలు కల్పించిన అనంతరం మెరిట్ ఆధారంగా రిక్రూట్‌మెంట్ నిర్వహించాలనే వాదన వినిపిస్తోంది.

పక్కాగా నిబంధనలు పాటించాం

జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆరు కేట గిరీలకు సంబంధించి 22 పోస్టుల భర్తీ చేశాం. పక్కాగా ప్రొసీజర్ను పాటించి జాబితాను సిద్ధం చేశాం. రెండు నెలలపాటు అభ్యంతరాలు ఉంటే చెప్పాలని ఆ ప్రకాశం కల్పించాం. ఎవరూ ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు.

- వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజనాసుపత్రి, కడప.



ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ ఇష్టారాజ్యంగా నడుస్తోంది. 2008లో అప్పటి వైఎస్ సర్కారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 108తో మరిన్ని మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఎమర్జెన్సీ మెడికల్ ఇన్‌సర్వీస్ పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా కోర్సులకు శ్రీకారం చుట్టింది. పీజీ డిప్లొమా కోర్సును పూర్తి చేసిన వారిని ఎమర్జెన్సీ మెడికల్ పోస్టులకు రిక్రూట్‌మెంట్ చేసింది. తాజాగా జిజిహెచ్‌లో చేపట్టిన మెడికల్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఇన్‌సర్వీస్ పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా పూర్తి చేసిన వారిని విస్మరించడం చర్చనీయాంశంగా మారింది. బిఎస్‌సి ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (డిగ్రీ తరువాత) కోర్సు పూర్తి చేసిన వారిని అర్హులుగా నిర్ణయించి, పీజీలను విస్మరించడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది.

ఒంటిమిట్ట, పెద్దదర్గాను దర్శించిన గవర్నర్

ప్రజాశక్తి-ఒంటిమిట్ట/కడప అర్బన్


పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

మత సామరస్యానికి ప్రతీకైన కడప అమీన్‌పీర్ పెద్దదర్గాను సందర్శించడం తన అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా పర్యటనను చేపట్టిన గవర్నర్ తొలుత ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయం అర్చకులు గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు మేళతాళాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. శ్రీ కోదండరామ స్వామి దర్శనం అనంతరం రంగ మండపంలో అర్చకులు గవర్నర్‌కు వేద ఆశీర్వాదం చేశారు. టిటిడి జెఇఒ వీరబ్రహ్మం స్వామి వారి చిత్ర పటం, తీర్థ ప్రసాదాలు అందించి శేష వస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, కలెక్టర్ వి.విజయరామరాజు, ఎస్‌పి అన్బురాజన్, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, కడప, బద్వేల్ ఆర్‌డిఒలు ధర్మచంద్రారెడ్డి, వెంకట రమణ, జిల్లా అధికారులు, తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అనంతరం సాయంత్రం కడప పెద్దదర్గాను సందర్శించారు. ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, నగర మేయర్ సురేష్ బాబు, కలెక్టర్ వి.విజయ్ రామరాజులతో కలిసి పెద్దదర్గాలో పూల చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకు ముందుగా దర్గా ప్రతినిధులు గవర్నరుకు, అతిథులకు లాంఛనాలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం దర్గా విశిష్టత, చరిత్ర గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కడప నగర కమిషనర్ జి.ఎస్.ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, తహశీల్దార్లు శివరామిరెడ్డి, ఉదయ్ కుమార్ రాజు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి కృష్ణకిషోర్, డ్వామా పీడీ యదుభూషన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. గవర్నర్ జిల్లాలో ఒక రోజు పర్యటన ముగించుకొని కడప విమానాశ్రయం నుండి సాయంత్రం 6.03 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు.

నాణ్యమైన సేవలను అందించాలి


సిఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి, జెసి

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ అధికారుల పనితీరు బాగుంటేనే పాలన కూడా సంతృప్త స్థాయిలో సాగుతుందని నాణ్యమైన సేవలను అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసిలను ఆదేశించారు శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మే నెల 9న రాష్ట్ర ప్రభుత్వం అత్యంత. ప్రాధాన్యతతో ప్రారంభించనున్న 'జగనన్నకు చెబుదాం', స్పందన అర్జీలు, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్షించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమనికి కలెక్టరేట్లోని వీసీ హాలు నుంచి కలెక్టర్ వి.విజయ్ రామరాజు తోపాట ఎస్‌పి అన్బు రాజన్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్వో గంగాధర్ గౌడ్ హాజరయ్యారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం విసి హాలులో హాజరైన అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను విధిగా లక్ష్యాల సాధనకు అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా ఏకకాల సమయంలోనే ప్రజల నుండి వినతిని స్వీకరించడం, అందుకు సంబంధించిన ఆమోదయోగ్యమైన అంశాలను పరిగణలోకి తీసుకుని పరిష్కరించడం లేదా ఆమోదించి అమలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇంటి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక విసి హాలు నుండి...పులివెందుల ఆర్డీవో వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరించిన వైవీయూ విసి

ప్రజాశక్తి - కడప అర్బన్


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విసి

మే 6, 7 తేదీలలో నిర్వహించే జిల్లాస్థాయి డివైఎఫ్ఐ రాజకీయ శిక్షణ తరగతులకు సం బంధించిన కరపత్రాలను వైవీ యూ విసి ఆచార్య రంగా జనార్ధన్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ యువత మంచి మార్గం వైపు పయనించాలన్నారు. డివైఎఫ్ఐ యువత సమస్యలు పై అని నిత్యం స్పందిస్తూ మంచి పోరాటాలు,కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వారికి అభినందనలు అన్నారు. వారి శిక్షణా తరగతులు జయప్రదం కావాలని ఆకాంక్షిస్తున్నను అన్నారు. శివకుమార్ మాట్లాడుతూ మే 6,7 న బద్వేలులో జరిగే రాజకీయ శిక్షణా తరగతులకు జిల్లా వ్యాప్తంగా డివైఎఫ్ఐ నాయకత్వం రాష్ట్ర నాయకులు కూడా హాజరు అవుతారని అన్నారు. ముఖ్యంగా ఈ శిక్షణా తరగతులు లో నిరుద్యోగ సమస్యల పై భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం, చర్చించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్, నాయకులు రాజ్ కుమార్, ఇనాయితుల్ల పాల్గొన్నారు.

సిఆర్‌పి సేవలు మరువలేనివి

కడప అర్బన్ : క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రామమోహన్ సేవలు మరువలేనివని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జయనగర్ కాలనీ ప్రధాన ఉపాధ్యాయులు భాగ్యవతి పేర్కొన్నారు. శుక్రవారం వరికుంట రామ్మోహన్ పాఠశాలను వదిలి వెళుతున్న సందర్భంగా వీడ్కోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామమోహన్ 12 సంవత్సరాలుగా క్లస్టర్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఆయన చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా, కడప మండల విద్యాశాఖ అధికారి పాలెం నారాయణ, ఈ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులందరూ సహకారంతో చక్కగా పనిచేశానని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - కడప



అవగాహన కల్పిస్తున్న పిఒ నాగరాజు

మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల అనారోగ్యం పాలు కాకుండా మంచి ఆరోగ్యంగా ఉండవచ్చునని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ అంకాల నాగరాజు ప్రజలకు సూచించారు. ప్రభుత్వ పురుషుల కళాశాల స్వయం ప్రతిపత్తి కడప ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక క్యాంపులో భాగంగా నిరంజన్‌నగర్‌లో సమతుల్య ఆహారం, పోషక విలువలు, ఆరోగ్యం పైన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల అనారోగ్యం పాలు కాకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రజలకు తెలియజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

146 పరుగుల తేడాతో చిత్తూరు జట్టు విజయం


124 పరుగులు చేసిన అర్జున్

కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కడపలోని కెఎస్ఆర్ఎం, వైఎస్ రాజారెడ్డి ఎసిఎ సేడియం మైదానాల్లో ఎసిఎ అండర్ - 23 అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. కెఎస్ఆర్ ఎమ్ క్రికెట్ మైదానంలో శనివారం నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 146 పరుగుల తేడాతో చిత్తూరు జట్టు ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచిన కర్నూలు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగుకు దిగిన చిత్తూరు జట్టు 45 ఓవర్లలో 274 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని వై. తేజ రెడ్డి 73, వాహిద్ బాష 60, ధరణి కుమార్ 58 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని అక్షిత్ రెడ్డి బౌలింగ్ ప్రదర్శించి నాలుగు వికెట్లు తీసుకున్నాడు. రహిమాన్ రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 275 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్కు దిగిన కర్నూలు జట్టు 32.3 ఓవర్లలో 128 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని దినేష్ కుమార్ 51 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని మల్లేషన్, అనిల్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి చేరో నాలుగు వికెట్లు తీసు కున్నారు. వై.ఎస్ రాజారెడ్డి ఎసి ఏ స్టేడియంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో కడప జట్టుపై 101 పరుగుల తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటి ంగుకు దిగిన అనంతపురం జట్టు 48.1 ఓవర్లలో 301 పరుగులకు ఆల్ అవుట్ అయిం ది. ఆ జట్టులోని అర్జున్ టెండూల్కర్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. రెండు బంతులను ఎదుర్కొని6 బౌండరీలు, 12 బౌండరీ సిక్సుల సహాయంతో 124 పరుగులు చేశాడు.

టాపర్స్‌ను అభినందించిన మేయర్

ప్రజాశక్తి - కడప

ఇంటర్ ఫలితాల్లో స్టేట్, జిల్లా టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను శుక్రవారం నగర మేయర్ సురేష్ బాబు అభినందించారు. చైతన్య జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ మల్లిఖార్జున ఆధ్వర్యంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాల్లో చైతన్య జూనియర్ కళాశాల నుంచి బైపిసిలో స్టేట్ టాపర్ నఫీసా ఖానంను, ఎంపీసీలో వైఎస్ఆర్ జిల్లా నాల్గవ స్థానంలో నిలిచిన విదిషాను, ఎంఇసి, సిఇసి గ్రూప్‌లలో జిల్లా టాపర్స్ శ్వేత ,విజయ దుర్గలను అభినందించారు.


మజ్జిద్ నిర్మాణానికి చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాష

మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - కడప


ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మైనారిటీ సంక్షేమానికి పెద్ద పీట వేసి వారి సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధి కి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని ప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం తన నివాస కార్యాలయంలో హజ్రత్ బావా సాహెబ్ మియా మజ్జిద్ నిర్మాణానికి రూ.3 లక్షలు చెక్కును మజ్జిద్ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలోని షాహిపేటలో ఉన్న హజ్రత్ బావా సాహెబ్ మియా మజ్జిద్ నిర్మాణానికి వక్ఫ్ బోర్డ్ ఫండ్ నుంచి రూ.3 లక్షల చెక్కును అందజేశామన్నారు. అదే విధంగా కరుణాకర్ ప్రమాదవశాత్తు పులివెందుల డ్యామ్‌లో పడిపోయి చనిపోయాడని, మంజూరైన రూ.2 లక్షల చెక్కును మృతుడి బంధువులకు అందజేశారు. కార్యక్రమంలో హజ్రత్ బావా సాహెబ్ మియా మజ్జిద్ కమిటీ ప్రెసిడెంట్ అబిడ్ మియా, జనరల్ సెక్రెటరీ మహబూబ్ ఖాన్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఇబ్రహీం మియా, కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, బసవ రాజు, బండి ప్రసాద్, వైసిపినాయకులు సుబాన్‌బాషా, నరపు రెడ్డి సుబ్బారెడ్డి, తోట కృష్ణ పాల్గొన్నారు.

10లోగా నూతన అక్రిడిటేషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

కడప : 2023-24 సంవత్సరాలకు జిల్లాలోని పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసేందుకు మే 10 లోపు ప్రింట్, ఎలక్ట్రానిక్, ఫ్రీలాన్స్, వెటరన్, న్యూస్ఏజెన్సీ జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ విజయ్‌రామరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. జర్నలిస్టులందరూ http://www.ipr.ap.gov.in వెబ్‌సైట్‌లో వారికి సంబంధించిన వివరాలను అప్ లోడ్ చేసుకొని, ఆ తదుపరి ప్రింట్ డాక్యుమెంట్ కాపీలను, జత పరచిన పత్రాలతో సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో జత చేయాల్సిన డాక్యుమెంట్లన్నీ పిడిఎఫ్ ఫార్మెట్‌లో, ఫొటోలను జెపిజి, సిగ్నేచర్‌ను పిఎన్‌జి ఫార్మెట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలోని పాత్రికేయులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగర చేసుకోవాలన్నారు.

అసత్య ప్రచారం తగదు

ప్రజాశక్తి - కడప అర్బన్


ఆలయ నమూనా చూపిస్తున్న కమిటీ సభ్యులు

నగరంలోని మాసాపేటలో ఉన్న పురాతన శ్రీ సీతారాముల, శివాలయం ఆలయాల తొలగింపు పై కొంతమంది పనిగట్టుకుని అసత్య ప్రచారం చేయడం తగదని ఆలయ కమిటీ ధర్మకర్త గున్న గంగాధర్, సభ్యులు చిగురుపాటి త్యాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక మాసాపేటలోని డివిజన్ కార్యాల యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బక్కా అయ్యన్న ఆశయాలకు అనుగుణంగా ఆలయం పునర్ నిర్మించడం, స్థానికులకు పట్టాలు ఇప్పించడం కమిటీ సభ్యులుగా తాము చేస్తామని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ స్థానికులకు, ఆలయ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తున్నారని చెప్పారు. కొంతమంది ఆలయ స్థల ఆక్రమణదారులు మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నంలో భాగంగా విశ్వహిందూ పరిషత్ వారితో చేతులు కలపడం బాధాకరమన్నారు. వీరికి వాస్తవాలు చెప్పకుండా ఆక్రమిత స్థలాలను అనుభవించేందుకు ఆలయ పునర్నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని తెలిపారు. కమిషనర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేయడం సమంజసం కాదన్నారు. 54 సెంట్లు ఆలయ స్థలాన్ని స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేసేందుకు రూ.30 లక్షలు మంజూరు చేసిన కమిషనర్‌ను అభినందించారు. సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షులు పెంచల నరసింహులు, జి. వరాహులు, ఎం. ఫిలిప్ పాల్గొన్నారు.

5న బౌద్ధారామాల సందర్శన

ప్రజాశక్తి - కడప అర్బన్

సుప్రసిద్ధ నందలూరు బౌద్ధారామాలను వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలకు చెందిన బౌద్ధ సంఘాలు, చారిత్రక, వారసత్వ, పర్యాటక సామాజిక సేవా సంస్థలు సందర్శించనున్నాయి. మే 5న బుద్ధ జయంతిని పురస్కరించుకుని నగరానికి చెందిన బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ ప్రతినిధి కుమారస్వామి, డాక్టర్ అశోక్‌కుమార్, శివారెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, గౌరీశంకర్, ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి, పి.వి. సుబ్బారెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు తమతమ సంస్థల ప్రతినిధులతో కలిసి ఉదయం 7.00 గంటలకు బౌద్ధారామాలను చేరుకోనున్నారు. అక్కడ అన్ని సంస్థలు ఉమ్మడిగా బుద్ధుని అష్టాంగ సూత్రాల గురించి వివరిస్తారు. కార్యక్రమంలో రెండు జిల్లాలకు చెందిన పురావస్తు, పర్యాటకశాఖల ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, బుద్ధిస్టులు హాజరు కానున్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

కడప : జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ విజయ్ రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తకు సంబంధించి 12 పోస్టులకు, సహాయకురాలు పోస్టులు 40, మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టులు నాలుగు ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తులను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని మే 3లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.


పరికరం ఆవిష్కరణలో డాక్టర్ వెంకటేశ్వరరావు

రిమ్స్‌లో అత్యాధునిక పరికరం ఆవిష్కరణ

కడప అర్బన్ : రిమ్స్ ఆస్పత్రిలో చెవి, ముక్కు, గొంతు విభాగంలో వినికిడి పరీక్ష చేయడానికి ఉపయోగించే ఆడియోమీటర్‌ను ఆస్పత్రి ప్రధాన పర్యవేక్షకులు డాక్టర్ వెంకటేశ్వరావు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్, డాక్టర్ లక్ష్మిబాయి, ఆర్ఎంఒ డాక్టర్ వై. శ్రీనివాసులు, నర్సింగ్ పర్యవేక్షకులు శ్రీకాంత్, డాక్టర్ ఎస్ఎఎస్ ఫరూఫ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చెవి, ముక్కు, గొంతు విభాగం అధికారి డాక్టర్ భాస్కరన్ మాట్లాడుతూ ఈపరికరంతో చెవుడు సమస్య ఉన్నవారిని పరీక్షించి అవసర మైన ఆపరేషన్లు చేస్తామని పేర్కొన్నారు. చెవి, ముక్కు, గొంతు విభాగంలో అధునాతన చికిత్సలు, క్లిష్టమైన అపరేషన్లు చేస్తున్నామని తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. అధునాతన ఆడియోమీటర్‌ను అందించిన సూపరింటెండెంట్, ప్రిన్సిపల్, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

1 నుంచి క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

కడప : మే నెల 1 నుంచి కడప, నందలూరు, ప్రొద్దుటూరు, బ్రహ్మంగారిమఠం సబ్ సెంటర్లలో క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్, డిసిఒ ఎస్. కాజా మైనుద్దీన్ తెలిపారు. ఆసక్తి గలవారు తమ పేర్లను ఆయా సబ్ సెంటర్లలో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉదయం 6 నుంచి 8:30 వరకు, సాయంత్రం 4:00 నుంచి 6:00 వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. పేర్లు నమోదు చేసుకున్న వారు పై తెలిపిన సమయాల్లో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరంలో పాల్గొనాలని వారు కోరారు.

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - కడప అర్బన్

కెఎస్ఆర్ఎం ఇంజి నీరింగ్ కళాశాలలో కళాశాల హెల్త్ క్లబ్, సెక్సువల్ హరాస్మెంట్, ఉమెన్ ఎంపవర్మెంట్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పని భద్రత- ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ హరిత న్యూరో మానసిక వైద్య నిపుణులు మైండ్ కేర్ హాస్పిటల్ వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగస్తులందరూ పనిచేసే చోట ఒత్తిడికి లోను కాకుండా భద్రత నియమాలు పాటించాలని పేర్కొన్నారు. వారు భద్రంగా ఉండి, తోటి వారు కూడా అప్రమత్తంగా భద్రతా మెళకువలు కలిగి ఉండాలని తెలిపారు. పనిలో కలిగే ఒత్తిడి నుంచి బయటపడే మార్గాల గురించి వివరంగా నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), ప్రధాన ఆచార్యులు డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్ కుమార్, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతులు డాక్టర్ శ్రీవాణి, ప్రోగ్రాం సమన్వయకర్తలు ఏ. ఆనంద్, జి. రాధా, షర్మిల భాను, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ హరిత

ఇంటర్ ఫలితాల్లో జిల్లా చివరి స్థానం దారుణం

కడప అర్బన్ : ఇంటర్ ఫలితాల్లో సిఎం సొంత జిల్లా చివరి స్థానంలో నిలవడం దారుణమని, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే చివరి స్థానంలో నిలిచిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ఫలితాల్లో జిల్లా చివరి స్థానానికి చేరుకోవడాన్ని ఆర్‌జెడి బాధ్యత వహించాలన్నారు. ప్రస్తుతం ఆర్‌జెడిగా ఉన్న రవి గతంలో డివిఇఒగా, ఆర్ఐఒగా పని చేశారని తెలిపారు. ఆర్‌జెడి రవి ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న పెండ్లిమర్రి జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 13 శాతం, రెండవ సంవత్సరం 27.18 శాతంఉత్తీర్ణత సాధించడం బాధా కరమని వాపోయారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలపై పర్యవేక్షణ లోపం కారణంగానే ఉత్తీర్ణత శాతం దారుణంగా పడిపోయిందని తెలిపారు. ఫలితాలపై దృష్టి పెట్టకుండా అక్రమ సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్న అధికారులను తొలగించి, జిల్లా ఇంటర్మీడియట్ ఫలితాలపై కలెక్టర్, రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు సమీక్షించి మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కోరారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్, సురేష్ నాయక్, జిల్లా సహాయ కార్యదర్శి రాహుల్ పాల్గొన్నారు.

సామాజిక స్పృహతోనే మార్పు

కడప : ప్రజల్లో సామాజిక స్పృహ, అవగాహన పెంపొందినపుడే సమాజంలో మార్పు మొదలవుతుందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో హాలులో సోసియల్ బిహేవియర్ చేంజ్ కమిటీ సమావేశం నిర్వహించారు సమావేశానికి కలెక్టర్‌తో పాటు కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా కో-ఆర్డినేటర్ కేతురా లాంబ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో పరివర్తనతోనే నవ సమాజంలో మహిళా సాధికారత, స్త్రీ పురుషుల సమానత్వం, స్త్రీ విద్య సాదం అవుతుందని చెప్పారు. బాలికలు, చిన్నారులపై నేరాలు కూడా పూర్తి స్థాయిలో తగ్గుతాయని తెలిపారు. ముఖ్యంగా బాలికలు ఆరోగ్యవంతంగా ఎదిగితేనే ఆ కుటుంబం అన్ని విధాలా శక్తిమంతంగా మారుతుందన్నారు.

వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కలసపాడు

విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ చిత్తా ప్రభావతి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నందున వడదెబ్బబారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి వద్ద ఉంటూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై దృష్టి సారించి ఇంటి వద్ద తల్లిదండ్రులకు చేయూతన ఇవ్వాలని సూచించారు. రోజూ ఐదు నుంచి ఆరు లీటర్ల నీళ్లు తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

పరాకాష్టకు వైసిపి దౌర్జన్యం : టిడిపి

ప్రజాశక్తి- కడప అర్బన్

బద్వేల్‌లో వైసిపి నేతల దౌర్జన్యం పరాకాష్టకు చేరుకుందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వితంతు మహిళ అని కూడా చూడకుండా అధికార మదంతో వైసిపి నేతల దౌర్జన్యాని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బద్వేలు మండలం చెన్నం పల్లె గ్రామంలో లక్ష్మీ దేవి అనే మహిళ 15 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ఇంటిని దౌర్జన్యంగా కూల్చివేశారని పేర్కొన్నారు. ఇంటిలో సామాన్లు బయటపడేసి, విలువైన వస్తువులు చల్లచదురు చేసి ఒక భయభ్రాంతులకు గురి చేయడం బాధాకరమని తెలిపారు. దౌర్జన్యం చేసిన వైసిపి గుండాలపై ఎస్‌పి, బద్వేల్ ఆర్‌డిఒ కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నష్టపోయిన బాధితురాలికి ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం చెల్లించి, ప్రభుత్వమేంటిని నిర్మించి ఇవ్వాలని తెలిపారు.

మలేషియాలో ఉత్తమ పురస్కారాలు

ప్రజాశక్తి - చాపాడు

కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మన గ్రోమోర్ కంపెనీ మలేషియాలో నిర్వహించిన సమావేశంలో కడప జోనుకు సంబంధించి సిబ్బందిని సన్మానించింది. ఉత్తమ జోనల్ మేనేజర్ (చల్ల రఘువీరారెడ్డి), ఉత్తమ ఏరియా మేనేజర్ (సాదు దామోదర్ నాయుడు), ఉత్తమ మార్కెటింగ్ మేనేజర్ (మొగిలి బలబీమసాగర్), ఉత్తమ స్టోర్ మేనేజర్ (ముక్కెర బయన్న) లకు, వారి ప్రతిభను గుర్తించి రిటైల్ విభాగానికి సంబంధించి పురస్కారాలు అందజేశారు. ఈ పురస్కారాలు ఇవ్వడం పట్ల జోనల్ మేనేజర్ రఘువీరారెడ్డి, డాక్టర్ చక్రధర్ ఆనందం వ్యక్తం చేశారు. తమ కృషిని కంపెనీ గుర్తించినందుకు రుణపడి ఉంటామని తెలిపారు. ఇంతటి ఘన విజయానికి పరోక్షంగా కారణమైన రైతు సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.



వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న ఎస్‌బిఐ అధికారులు

అంగన్వాడీ కేంద్రం దత్తత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్

మండలంలోని గోపవరం పంచాయతీ యానాది కాలనీలో ఉన్న అంగన్ వాడీ కేంద్రాన్ని స్టేట్ బ్యాంకు ప్రొద్దుటూరు ఎడిబి శాఖ వారు దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ మెహన్ రాజు మాట్లాడుతూ రూరల్ పరిధిలోని అంగన్వాడీ సెంటర్‌ను దత్తత తీసుకోని మౌలిక వసతులు కల్పించమన్నారు. వాటర్ ట్యాంక్, టీ.వీ, ఆక్వా వాటర్ ఫిల్టర్ ,రెండు బీరువాలు, ట్యాబ్, రంగులు, రాతి అల్మరా, కరెంటు సౌకర్యాలను ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో జోనల్ సెక్రటరీ సంజీవ ఆనంద్ కుమార్, లోకల్ సెక్రటరీ గంగాధర్ యాదవ్, ఆరోగ్య శాఖ సూపర్ వైజర్, బిఎ వరప్రసాద్, ప్రధానోపాధ్యాయులు గురునాధగుప్తా, అంగన్ వాడీ కార్యకర్త రాణీ, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు స్వర్ణామృత ప్రాసనం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం ఆరు నెలల శిశువు నుండి 16 సంవత్సరాల పిల్లలకు స్వర్ణామృత ప్రాసనం చుక్కలను రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, వైసిపి యువ నాయకుడు చిత్తా గిరి ప్రణీత రెడ్డి, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షులు తులసి సురేష్ బాబు ఆధ్వర్యంలో చుక్కలను అందజేశారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి చిన్నపిల్లల కోసం ఒక అపురూప రోగ నిరోధక శక్తి వర్ధక స్వర్ణామృత ప్రాశనం మందును వికాస తరంగిణి పోరుమామిళ్ల శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెలకు ఒకసారి చొప్పున 21 నెలలు స్వర్ణామృత పుష్యమి నక్షత్రంలో తీసుకోవాలని పేర్కొన్నారు. స్వర్ణామృతాన్ని తీసుకోవడం వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి, మానసిక స్థితిలో మార్పులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సెక్రెటరీ విశ్వనాధుల జనార్ధన్ శ్రేష్టి, ఉపాధ్యక్షులు వలెం పిచ్చయ్య, క్యాషియర్ చాటుకొండు సుబ్రమణ్యం, కమిటీ సభ్యులు అచ్యుత పాల్గొన్నారు.

ఎంపీ అవినాష్‌కు వత్తాసు పలకడం శోచనీయం

వేంపల్లె : మాజీ మంత్రి వివేకానందరెడ్డిని కాంగ్రెస్ హయాంలో ఎటిఎం లాఇవ జడ్పిటీసీ రవికుమార్ రెడ్డి వాడుకొని ఇప్పుడు ఎంపీ అవినాష్ రెడ్డికి వత్తాసు పలకడం శోచనీయమని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో జడ్పిటిసి రవి కుమార్ రెడ్డి కడప, హైదరాబాద్‌లో వివేకానందరెడ్డి వెనుకే ఉండి అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. కార్యకర్తలకు, నాయకులకు ఏ ఒక్కరికీ ఛాన్స్ ఇవ్వకుండా అన్ని పనులు జడ్పిటిసి చేయించుకొంటూ అధిపత్యాన్ని కొనసాగించినట్లు చెప్పారు. ప్రస్తుతం వివేకానందరెడ్డి హత్యకు గురి అయితే ఆయన కుమార్తెకు మద్దతు తెలపకుండా ఎంపీ అవినాష్ రెడ్డికి వత్తాసు పలకడం దుర్మార్గమైన చర్య అన్నారు. తప్పుడు ఆరోపణలు మానుకోవాలని సూచించారు. జడ్పీటీసీకి రాజకీయ బిక్ష పెట్టింది వివేకానందరెడ్డినే అన్నారు. సమావేశంలో మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, నియోజక వర్గ రైతు విభాగం అధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, సీనియర్ నాయకుడు పాపిరెడ్డి, యూనిట్ సభ్యుడు జబీవుల్లా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మెదర రవి కుమార్ మహమ్మద్ ఇనాయతుల్లా, డక్కా రమేష్, వీరబద్ర, ఈశ్వరయ్య, వెంకటయ్య, గొగుల మారుతి, యోగాతో పాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జెకెసి ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

పోరుమామిళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మే డే రోజు న జెకెసి విభాగం ఆధ్వర్యంలో చెన్నైకి చెందిన మద్రాస్ సిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ వారు సేల్స్ మెన్, సేల్స్ అస్సిస్టెంట్స్, సూపర్ వైజర్, కస్టమర్ సర్వీస్ ఎగ్జికూటివ్,సెక్యూరిటీ గార్డ్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ నరేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేతనం రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుందన్నారు. పది, ఇంటర్, డిగ్రీ అపైన పాస్‌అయిన విద్యార్థుల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూల హాజరయ్యే వారు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9052287046లో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

జమ్మలమడుగు రూరల్ : విద్యార్థులకు శుక్రవారం సాంఘిక శాస్త్రం పరీక్ష అనంతరం 1 నుంచి 9 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వేసవి సెలవులు ప్రభుత్వం ప్రకటించింది. నేటి నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉండనున్నాయి. ఈ సమయంలో ఎండలు అధికంగా ఉండడంతో పిల్లలను తల్లిదండ్రులు ఒక కంట కనిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాధ్యమైనంతవరకు ఇంట్లో నుంచి బయటికి పిల్లలు రాకుండా చూసుకోవాలి. అందుకు ఇంట్లోనే పిల్లలతో బుక్ రీడింగ్స్, రైటింగ్ పైన ఆసక్తి కనపరిచేలా చూడాలి. ఇంటి లోపలనే క్యారం బోర్డ్, చెస్ వంటి క్రీడల పై అవగాహన కల్పించాలి. స్మార్ట్ టీవీ ఇంట్లో ఉన్నట్లయితే యూట్యూబ్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పైన, ఇంగ్లీష్ లాంగ్వేజ్ పైన అనేక చానల్స్ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ముందుకు వచ్చాయి. సినిమాల బదులు వాటిని విరామ సమయంలో చూపించి పిల్లల అభివృద్ధికి బాటలు వేయగలరని మేధావులు చెబుతున్నారు.



వికలాంగుల సేవా కేంద్రానికి కూలర్ వితరణ చేస్తున్న ఉపాధ్యాయులు, ఎంఇఒ

స్వరూపరాణి సేవలు మరువలేనివి

చింతకొమ్మదిన్నె : ఉపాధ్యాయులు స్వరూపరాణి సేవలు మరువలేని వని మండల విద్యాశాఖ అధికారి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు, శుక్రవారం మండలంలోని చిన్నముసలిరెడ్డిపల్లెలోని అనాథ వికలాంగుల సేవా కేంద్రానికి మండల ప్రజా పరిషత్ సీఎంఆర్ పల్లిలో పనిచేస్తున్న టీచర్ స్వరూపారాణి, ఎంఇఒ చేతుల మీదుగా, ఆమె భర్త గురయ్య ఎయిర్ కూలర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు గతంలోనూ పలు సేవా కార్యక్రమాలు చేశారని చెప్పారు. ఇది వారి సేవ తత్పరణకు నిదర్శనమని ఆయన కొనియాడారు. దాతలు సహకరించి పేద అనాధ పిల్లలను ఆదుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 17వ డివిజన్ వైసిపి ఇన్‌ఛార్జి మల్లి శ్రీనివాస్ రెడ్డి, రామాంజనేయ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బ్రహ్మంగారిమఠం : మండలలోని డి అగ్రహారం వద్ద లారీ వ్యక్తిని ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. బద్వేల్ పట్టణంలోని సుమిత్ర స్ట్రీట్‌కు చెందినటువంటి చిన్న అంకయ్య (50) మైదుకూరు సమీపంలో బతుకుదెరువు కోసం ఎద్దును కొనుగోలు చేసుకుని తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో అటువైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బి. మఠం ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. కసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అర్హులకు సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మైదుకూరు ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బద్రిపల్లె పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. బద్రిపల్లెలో సంక్షేమం, అభివృద్ధి ద్వారా రూ.10 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. నాలుగు సంవత్సరాలలో సంక్షేమ పథకాలు అమలు పరచడంలో వైసిపి ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని, అభివృద్ధి గడప గడప కార్యక్రమంలో ప్రజలలో ఉన్న ఉత్సాహంలో కనపడుతుందని ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందన చూస్తుంటే సిఎంగా జగన్ ను చిరకాలం ఆదరిస్తారని భావిస్తున్నామన్నారు. రైతులకు అవసరమైన సాగునీటిని సకాలంలో రెండు సీజన్‌లకు విడుదల చేస్తున్నామన్నారు. విద్య, వైద్యం, రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పంట నష్టపరిహారాన్ని రైతులకు సకాలంలో విడుదల చేస్తామని చెప్పారు. త్వరలోనే పసుపు పంటను గిట్టుబాటు ధర తో కొనుగోలు చేపడతామన్నారు. దారి వెంట ఆరబెట్టిన వరి ధాన్యాన్ని పరిశీలించి ధరలు, దిగుబడి గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ టి లక్షుమయ్య, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, తహశీల్దార్ సుబానీ, ఇఒపిఆర్‌డి రాధా కృష్ణవేణి, ఎంఇఒ రవి శంకర్, ఎఒ మ్యాగీ, హౌసింగ్ ఎఇ మహబూబ్ బాష, వైసిపి నాయకులు రాజ శేఖర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, జయరామిరెడ్డి, జయ సుబ్బారెడ్డి , శాంత రాజు, వినయ్ కుమార్ రెడ్డి, కిషోర్ కుమార్ రెడ్డి, అబ్బిరెడ్డి, నరసింహారెడ్డి, ఓబుళ రెడ్డి, పుల్లయ్య, ప్రకాష్, అంజన్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

బిసిల పట్ల వైసిపి, టిడిపిలది కపట ప్రేమ : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

బిసిల పట్ల వైసిపి, టిడిపిలు కపట ప్రేమ ప్రదర్శిస్తోందని, బిసిలకు నిజమైన నేస్తం కాంగ్రెస్ ఒక్కటేనని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1970లోనే విద్యా, ఉద్యోగాల్లో కాంగ్రెస్ పార్టీ బిసిలకు 25 శాతం రిజర్వ్‌షన్లు కల్పించిందన్నారు. 1993లో కూడ స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీ బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని అన్నారు, 2008లో కాంగ్రెస్ పార్టీ బిసి విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ పథకాలను ప్రారంభించింది అన్నారు. 1994లో కాంగ్రెస్ పార్టీ సచివాలయంలో బిసి డిపార్ట్‌మెంట్ ప్రారంభించిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ 4 బిసి కమిషన్లు, బిసి హాస్టళ్లు, బిసి రెసిడెన్షియల్ పాఠశాలలు స్థాపించిందని తెలిపారు. బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ విద్య, ఉద్యోగాల్లో 25 శాతం బిసిలకు రిజర్వేషన్లు కల్పించిందని అన్నారు. కాంగ్రెసు పార్టీ అమలు చేసిన రిజర్వేషన్లు వల్ల లక్షలాది మంది బిసిలకు ఉన్నత చదువులు చదివి ఉద్యోగులు చేస్తున్నట్లు చెప్పారు. లక్షలాది మంది బిసిలకు ప్రజాప్రతినిధులు కూడా అయ్యారని తెలిపారు. బిసిలకు తామే రిజర్వేషన్లు కల్పించినట్లు టిడిపి పార్టీ నాయకులు చెప్పడం గమనార్హం అన్నారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు బిసి విద్యార్థులకు కూడ ఫీజు రీయంబస్ మెంట్, స్కాలర్ షిప్ లు 2008 లో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. బిసిల సాధికారత కోసం కృషి చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు, ఇప్పటికైనా వైసిపి, టిడిపిలు బిసిల పట్ల మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని తులసిరెడ్డి కోరారు.

ఎసిపి పనితీరు సక్రమంగా లేదు

కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ ఓబుల్‌రెడ్డి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసిపి) పనితీరు సక్రమంగా లేదని, తన వార్డులోని అక్రమ నిర్మాణాల గురించి ఎన్నిసార్లు చెప్పినా స్పందించకపోవడమేగాక తాము సమాచారం కావాలని అడిగితే నిర్లక్ష్యంగా, వ్యంగంగా సమాధానమిస్తున్నారని 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మిదేవి అధ్యక్షతను కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా కౌన్సిలర్ వరికూటి మాట్లాడుతూ తన వార్డులో సాయిబాబా ఆలయ సమీపంలో అనుమతి తీసుకున్నదానికంటే అదనంగా అక్రమంగా 19,158 చదరపు అడుగులతో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారన్నారు. ఈ విషయం గతంలో పలుమార్లు టౌన్‌ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోలేదని వాపోయారు. సమాచారం కోసం అడిగితే పొంతన సమాధానాలతో పాటు కౌన్సిలర్లకు శిక్షణ ఇస్తానని వ్యగంగా సమాధానం చెప్పడం ఏంటని ప్రశ్నించారు. స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులైన కౌన్సిలర్లను గౌరవించాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు జోడెద్దులలాంటి వారని అందరం కలిసి మున్సిపాల్టీ అభివృధికి కృషి చేయాలన్నారు. మున్సిపల్ అధికారుల తీరుపట్ల కమిషనర్ దృష్టి సారించాలని కోరారు. ప్రస్తుత కౌన్సిల్ ఏర్పడినప్పటి నుంచి 624 పనులను రూ.94కోట్ల38లక్షలతో చేపట్టినట్లు తెలిపారు. ఇందులో సుమారు 600 పనులు పూర్తి అయ్యాయన్నారు. రూ.లక్షకు తక్కువ విలువతో చేసిన పనులు మరో సుమారు 400 ఉంటాయన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు ఇవి అదనం అన్నారు. ముఖ్యమంత్రి జగన్ నాయకత్వంలో అభివృద్ధి సాధ్యమైందన్నారు. అంజెండాలోని 30 అంశాలను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. సమావేశంలో వైస్‌చైర్మన్‌లు బంగారురెడ్డి, ఖాజామోహిద్దీన్, కౌన్సిలర్లు ,అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ ఓబుల్‌రెడ్డి

ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది కృషి చేయాలని జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రీ, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలోని సభ భవనంలో జగనన్న ఇంటి నిర్మాణాలపై ప్రజాప్రతినిధులకు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ సచివాలయం పరిధిలో జరుగుతున్న ఇంటి నిర్మాణాలపై వాలంటీర్లు, ఇంజినీరింగ్ సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణాల పనులపై ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు. లబ్ధిదారుల నుంచి ఇంటి నిర్మాణం చేస్తానని చెప్పి డబ్బులు తీసుకొని నిర్మాణం చేపట్టని కాంట్రాక్టుపై పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని లబ్ధిదారులకు జడ్‌పిటిసి సూచించారు. జూన్ ఆఖర్ వరకు ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని, లేకపోతే లబ్ధిదారులకు బిల్లులు మంజూరు కావని తెలిపారు. ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయకపోతే అలాంటి లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చి ఇంటి స్థలాన్ని రద్దు చేస్తామని చెప్పాలని కోరారు. ఇంటి నిర్మాణానికి రుణాలు కావాలంటే వెలుగు సంస్థ ద్వారా రుణాలు మంజూరు చేస్తారని, లబ్ధిదారులు యానిమేటర్లను సంప్రదించాలని సూచించారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టే విషయంలో వాలంటీర్లు రోజూ శ్రద్ధ పెట్టాలని సూచించారు. స్వయంగా లబ్ధిదారులు మాత్రమే ఇంటి నిర్మాణాలు చేపట్టాలని ఇతరులకు కాంట్రాక్టు ఇచ్చి వారు కట్టక పోతే తమకు సంబంధ లేదన్నారు. ఇళ్లు కట్టక పోతే మాత్రం కచ్చితంగా రద్దు చేస్తామని తెలిపారు. పనులు మొదలు పెట్టని లబ్ధిదారులకు చెందిన స్థలాన్ని రద్దు చేసి ఇతరులకు కేటాయిస్తామని చెప్పారు. కాలనీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ రవీంద్రారెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, ఎంపిటిసిలు కటిక చంద్ర, మణి,వార్డు మెంబర్లు షఉకుర్, వెంకటేష్, వెలుగు ఎపిఎం బాలస్వామి, సచివాలయం కార్యదర్శులు, వాలింటిర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి - వేంపల్లె

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించినప్పుడే బ్యాంకులకు పేరు వస్తుందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలోని పులివెందుల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్‌డిఎఫ్ సి బ్యాంకును శుక్రవారం జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు బ్యాంకులు అందుబాటులో ఉండి విరివిగా రుణాలు మంజూరు చేయాలని కోరారు. బ్యాంకులకు వస్తున్న ఖాతాదారులతో ప్రేమాభిమానంతో మెలగాలని సూచించారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ప్రయివేట్ రంగంలో దేశంలోనే అతి పెద్ద బ్యాంకు అన్నారు. లక్ష 66 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని చెప్పారు. అలాగే రూ.25 లక్షల కోట్ల ఆస్తులు ఉన్నట్లు చెప్పారు. అటువంటి బ్యాంకు శాఖ వేంపల్లెలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, గండి అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుంద రెడ్డి, కాంగ్రెసు నాయకులు రామకృష్ణ, ఉత్తన్న, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం తగదు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పులివెందుల పురపాలక పరిధిలో నీటి సరఫరాలో అంతరాయం కల్గకుండా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వి. వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మునిసిపల్ కమిషనర్ వి వి నరసింహ రెడ్డితో కలిసి పురపాలక సంఘం లో పనిచేస్తున్న నీటి సరఫరా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి దృష్టిలో ఉంచుకొని ఎక్కడే కానీ నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ వారికి నీటి సరఫరా సమయం తెలుపుతూ ఉండాలన్నారు. ఒకవేళ ఎక్కడయినా నీటి సరఫరాకు అంతరాయం కలిగితే ట్యాంకర్ల ద్వారా అందించేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. అనంతరం అంబక పల్లిరోడ్డు లోని దోభి ఖానాలో పర్యటించి అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఇ ఎక్‌నాథ్‌యాదవ్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డిఆర్‌ఎం

ఎర్రగుంట్ల: స్థానిక రైల్వే స్టేషన్‌ను శుక్రవారం డిఆర్‌ఎం వెంకటరామిరెడ్డి సందర్శించారు. రైల్వే స్టేషన్‌లోని రన్నింగ్ రూమ్ (డ్రైవర్ల విశ్రాంతి గది)ను, రైల్వే స్టేషన్ పరిధిలో నిర్మిస్తున్న ప్రహరీని పరిశీలించారు. స్థానిక జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి డిఆర్‌ఎంని కలిసి ముద్దనూరు స్టేషన్‌లో ధర్మవరం చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలును ఆపాలని వినతి పత్రం ద్వారా కోరారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



డిఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

యుసిఐఎల్ అధికారులకు ఉచిత వైద్య శిబిరం

పులివెందుల రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో యుసిఐఎల్ తుమ్మలపల్లిలో పనిచేస్తున్న ఎస్‌పిఎఫ్ సిబ్బంది సిబ్బందికి, అధికారులకు శుక్రవారం ఉచిత వైద్య సిబ్బంది నిర్వహించారు. ఎస్‌పిఎఫ్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ బివి రామిరెడ్డి ఆదేశాల మేరకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు స్థానిక అసిస్టెంట్ కమాండెంట్ డి.హుస్సేనయ్య తెలిపారు. 157 మంది సిబ్బందికి వైద్య పరీక్షలను పులివెందుల ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డేవిడ్ రాజు డాక్టర్ ఏజీఎస్ సుధీనా నిర్వహించారు. యుసిఎల్ సిబ్బందికి బిపి, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించినట్లు వారు తెలిపారు.

కొండపేటలో 'జగనన్నే మా భవిష్యత్'

చెన్నూరు : మండలంలోని కొండపేటలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, ఎంపిపి చీర్ల సురేష్‌యాద్, అధ్యక్షులు సుబ్బారెడ్డి, పట్టణ కార్యదర్శి శ్రీనివాసరాజు, కొండపేట సర్పంచ్ తుంగచంద్రయాదవ్, దుంప నాగిరెడ్డి, సీనియర్ నాయకులు గంగుల్లయ్య, సీనియర్ నాయకులు వీరారెడ్డి, కిరణ్, కేశవ్, పార్టీ గ్రామ ప్రెసిడెంట్ నర్సింగారెడ్డి వాలంటీర్లు పాల్గొన్నారు.



ఇంటర్ ఫలితాలలో వాగ్దేవి జూనియర్ కళాశాల ప్రభంజనం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని వాగ్దేవి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ గుర్రం పుల్లపునాయుడు, కళాశాల ప్రిన్సిపల్ బాల వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైపిసి విభాగంలో నవీన జ్యోతి 974, యశ్విత 973 మార్కులతో మండలంలో ప్రథమ స్థానాన్ని సాధించారని హర్షం వ్యక్తం చేశారు. ఎంపిసి విభాగంలో సునంద 977, శుభాన్ బాషా 977, శ్రీహరి 972, మార్కులు సాధించారన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాలలో ఎంపిసి విభాగంలో హేమన్య 458 మార్కులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్లు అభినందనలు తెలియజేశారు.



'ఆదర్శ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వల్లూరు

మండలంలోని గంగాయపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటర్‌లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు తెలిపారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ బి.సాయిలత బైపీసీ 912, వై.గౌతమ్ 844, ఎం. హర్షిత 837, జూనియర్ ఇంటర్ బి పూజ 394, సి.అనూష 440 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను అధ్యాపకులు ఈ సందర్భంగా అభినందించారు.

టూరిజం శాఖ రాష్ట్ర డైరెక్టర్‌గా రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని రాజుపాలెంకు చెందిన పోకల రామకృష్ణారెడ్డిని టూరిజంశాఖ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రం అందుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ఎంతో అభిమానిస్తున్నానని, యువతను ప్రోత్సహిస్తూ ఎన్నో చైతన్య కార్యక్రమాలు చేపట్టానని, తన సేవలను గుర్తించి ప్రభుత్వం టూరిజం శాఖకు డైరెక్టర్‌గా నియమించిందని చెప్పారు. తన నియామకానికి కారకులైన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రభుత్వం సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, చల్లామధుసూదన్‌రెడ్డికి, ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డికి, బద్వేల్ ఎమ్మెల్యే సుధాకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వర్తిస్తానని చెప్పారు. తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తలకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

అంతఃకరణ శుద్ధితో పనిచేయండి

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్

నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తా అంతఃకరణ శుద్ధితో పనిచేయాలని తెలుగుదేశం పార్టీ జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాల భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా నిర్మించిన నూతన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇంటిగ్రేడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆర్‌టిసి, ఐడిపి, బిఒటి, మన టిడిపి, యూనిట్లకు, బూత్ ఏజెంట్లకు, ఇన్‌ఛార్జులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు పది నెలల సమయం ఉందని, రానున్న ఎన్నికల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేసి 2024లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. జమ్మలమడుగులో పసుపు జెండా ఎగరవేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణ్ వర్ధన్ రెడ్డి, షేక్ అబిద్, ఫక్రుద్దీన్, హర్ష తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చదిపిరాల భూపేష్

నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తా : 'కాకర్ల'

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

జిల్లా పోలీస్ కంప్లైంట్స్ అథారిటీస్ సభ్యునిగా ప్రొద్దుటూరుకు చెందిన వైసిపి నాయకుడు అడ్వకేట్ కాకర్ల నాగశేషారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి మాట్లాడారు. కర్నూల్ హెడ్‌క్వార్టర్‌గాఎనిమిది జిల్లాలకు సంబంధించి నాగశేషారెడ్డితో పాటు మరో ఇరువురు విశ్రాంత అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. విశ్రాంత డిఎస్‌పి కె.వి.రాఘవరెడ్డితో పాటు విశ్రాతం డిప్యూటీ కలెక్టర్ సారెడ్డి శశిదేవి సభ్యులుగా కొనసాగుతారన్నారు. వీరి పదవీకాలం మూడు సంవత్సరాల పాటు ఉంటుందన్నారు. కర్నూల్ కడప, అనంతపురం, చిత్తూరు, నంద్యాల, శ్రీసత్యసాయి, అన్నమయ్య, తిరుపతి జిల్లాల పరిధిలోని బాధితుల కేసులను పరిష్కరిస్తారని చెప్పారు. సామర్థ్యం, పార్టీపట్ల విధేయతను పరిగణలోనికి తీసుకొని ముఖ్యమంత్రి జగన్ నియమించారన్నారు. అనంతరం నాగశేషారెడ్డి మాట్లాడుతూ లాకప్‌డెత్ లాంటి తీవ్రమైన కేసుల పట్ల శ్రద్ధ తీసుకొని పనిచేస్తామన్నారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, కృషి చేసిన ఎంఎల్‌ఏ రాచమల్లు ప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని శేషారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై చర్చ

ప్రజాశక్తి- ఎర్రగుంట్ల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి పనులపై నాయకులు, అధికారులు చర్చించారు. ఎంపిపి మూలే లక్ష్మీదేవితో సహా పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు గైర్హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రారంభమైన సమావేశంలో ముందుగా వై. కోడూరు సర్పంచ్ కొత్తవాసుదేవరెడ్డి మాట్లాడతూ తమ గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించలేదని పలుమార్లు అధికారులకు విన్నవించినా తూతూమంత్రంగా నిర్వహించారని వాపోయారు. ఎర్రగుంట్ల పిహెచ్‌సి వైద్యులు మాట్లాడుతూ నెలలో ఒకసారి వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. ప్రస్తుతం పిహెచ్‌సిలో రోజు పది కరోనా పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ ఎఇ మాట్లాడుతూ సచివాలయ భవనాలకు, రైతు భరోసా కేంద్రాలకు, విలేజ్ క్లీనిక్‌లకు అధికంగా కాంట్రాక్టర్లకు ధరలను చెల్లించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. కార్యక్రమంలో కార్యక్రమంలో జడ్‌పిటిసి తమ్మిశెట్టి బాలయ్య, సర్పంచులు, ఎంపిటిసిలు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 30న ప్రొద్దుటూరులో జిల్లా స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి వై.అహ్మద్‌బాష తెలిపారు. ఉదయం గం.9.30నిలకు అనిబిసెంట్ మున్సిపల్ ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. సీనియర్ విభాగంలో మహిళలకు, పురుషులకు 100, 200 ,400 ,800 మీటర్ల లాంగ్ జంప్, ట్రిబుల్ జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో కడప జిల్లావారు పాల్గొనవచ్చన్నారు. ప్రతిభకనబరచిన వారిని మే5న ఆచార్యనాగార్జున యూనివర్సిటీ గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికవుతారన్నారు. పాల్గొనే వారు 18 ఏళ్ల వయస్సు ధృవీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. విజేతలకు ప్రశంసాపత్రాలు ఇస్తామన్నారు. పూర్తి వివరాలుకు 9949686586లో సంప్రదించాలన్నారు.